## ధర్మనిర్ణయం

**రాత్రి పన్నెండు గంటలు దాటింది. బాగా దాహం వేయడంతో లేచాడు పరంధామయ్య. ఓసారలా పక్కకు దృష్టి సారించాడు. సతీమణి కళ్లు తెరచి సుదీర్ఘంగా ఏదో ఆలోచిస్తున్నట్లుండడం గమనించాడు.**

"పార్వతీ! నిద్రపట్టడం లేదా?" అడిగాడు జాలిగా. కళ్లొత్తుకుంటూ హావభావాలతోనే బదులిచ్చిందావిడ.

"పిచ్చిదానా! ఇప్పుడేమయిందనీ? ఏదో ఒకరికొకరు తోడూ నీడగా కాలం వెళ్లదీస్తున్నాం. ఇలాగే మన రోజెళ్లిపోతుంది. ఇప్పుడు లేనిపోనివన్నీ ఆలోచించడం, బెంగపెట్టుకోవడం దేనికి? ఈ ఆలోచనలు మానుకుంటే మనసు ప్రశాంతంగా వుంటుంది. నా మాట విని కాసిన్ని మంచినీళ్లు తాగి హాయిగా పడుకో. నిద్ర అదే వస్తుంది" అంటూ నీళ్ల గ్లాసందించాడు. పార్వతమ్మ మంచినీళ్లు గటగటా తాగేసి గ్లాసు పక్కన పెట్టేయడంతో పరంధామయ్య నడుం వాల్చి నిద్రలోకి జారుకున్నాడు.

ఎప్పటిలాగే తెల్లవారు ఝామున ఐదో గంట కొట్టగానే మెలకువ వచ్చేసిందాయనకు. మళ్లీ ఓసారలా పక్కకు దృష్టి సారించాడు. సతీమణి ఇంకా కళ్లు తెరచే వుంచింది. ఆమె రాత్రంతా నిద్రపోలేదని గ్రహించి, తాను కూడా అదేపనిగా ఆలోచనలో పడ్డాడు.

* * *

ఒక్కగానొక్క కొడుకుని అల్లారుముద్దుగా పెంచి పెద్దచేసి...చక్కగా విద్యాబుద్ధులు చెప్పించి..ఉద్యోగం వచ్చేదాకా వెయిట్ చేసి ఆ తర్వాత మంచి అమ్మాయిని చూసి కోడలిగా తెచ్చుకున్నారా దంపతులు.

బ్యాంక్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్న రోహిత్ గొప్ప వ్యక్తిత్వంగల మనిషి. ఆత్మాభిమానం...గౌరవ మర్యాదలు..దైవభక్తి..దేశభక్తిలాంటి సద్గుణాలన్నీ చిన్నప్పటి నుండే తండ్రి నుంచి అతగాడికి సంక్రమించాయి. మరి అలాంటివాడు పెళ్లయి నెల తిరక్కుండానే..లంకంత కొంపలో ఓ చిన్న గదొకటి చూపించి "ఇందులోనే మీ పాట్లేవో మీరు పడండి. మీకూ మాకూ ఏ సంబంధం లేదు. ఇన్నాళ్లూ నాకోసం మీరెంతగానో కష్టపడిపోయారని మీరనుకుంటే..అందుకుగాను మీకొచ్చే ఆ పెన్షన్ డబ్బులేవో మీకే వదిలేస్తున్నా. వాటితో శేషజీవితం వెళ్లదీసేయొచ్చు" నిష్కర్షగా చెప్పేశాడు. ఈ విషయంలో భార్య షర్మిల ఎంతగానో వారించి, చేసేదిలేక భోరున ఏడ్చేస్తూ లోపలికెళ్ళిపోయింది. దాంతో ఈ విషయంలో కోడలి ప్రమేయం ఏమాత్రం లేదని పెద్దోళ్ళిద్దరూ గ్రహించారు.



మరీ విపరీతపుబుద్ధి కొడుక్కెలా సంక్రమించిందో అర్థంకాక..చేసేదిలేక ముద్దాయిల్లా నిలబడిపోయారు పార్వతీ పరంధామయ్యలిద్దరూ.

ఆ గదిలోనే వాళ్ళిద్దరూ కాలం వెళ్ళదీస్తున్నారు. సొంత రక్తంలో ఈ పరాయితనం ఎక్కడి నుండొచ్చిందో అర్థంకాక కొన్ని రాత్రిళ్లలా ఆలోచనల్తో తలలు బద్దలు కొట్టుకుంటూనే వున్నారు. పార్వతమ్మకు గతం కళ్ల ముందలా కదలాడింది.

* * *

పార్వతమ్మకు పెళ్ళయిన ఆరు నెలలకే మామగారు కన్నుమూశారు. జీవిత భాగస్వామి తనను విడిచిపెట్టి వేరే లోకానికెళ్లిపోవడం అత్తగారినెంతగానో కృంగదీసింది. పరంధామయ్య మంచివాడే. పార్వతమ్మకు మాత్రం వేరింటి కాపురం పెట్టేయాలన్న భావన బలంగా నాటుకుపోయింది. అందుకు ఆయనేమాత్రం సమ్మతించలేకపోయాడు. కానీ చేసేదిలేక భార్యను కొంతవరకు ఒప్పించగలిగాడు.

"మనింట్లోనే ఓ గది అమ్మకి కేటాయిద్దాం. ఆమెకు వండి పెట్టడానికి, ఇతరత్రా అన్ని పనులూ చూసుకోవడానికీ ఓ మనిషిని పెట్టేద్దాం..సరేనా?" అన్నాడు. ఇదేదో కొంతవరకు బాగానే వుందనుకుంది పార్వతమ్మ.

కానీ తాను తప్ప ముసలితల్లిని పలకరించే వారెవరూ లేకపోయారా యింట్లో. కోడలు మాట్లాడదు సరికదా తప్పుకదా అని ఎవరైనా అంటే, "ఆమెకే లోటూ రాకుండా చూసుకుంటున్నాం. అది చాలదూ? ఈ విషయంలో మీ హితోపదేశం నాకక్కర్లేదు" అంటూ తెగేసి చెప్పేస్తుంది. కనీసం మనవలూ..మనవరాళ్లయినా 'నా..న..మ్మా' అంటూ నోరారా పలకరిస్తే చాలని ఆశగా ఎదురుచూస్తుండేది పరంధామయ్య తల్లి. ఆ కోరిక కూడా నెరవేరకపోవడంతో జీవితంపై విరక్తి కలిగి తన కథకు ముగింపు తానే చెప్పేసుకుంది.

* * *

"భగవంతుడు నాకూ, నా మాటకు ఆనాడు ఎదురు చెప్పలేకపోయినందుకు మీకూ మంచి శిక్షే వేసాడండీ" అంటూ భోరున ఏడ్చేయడంతో పరంధామయ్య కూడా ఆరున్నొక్కరాగాన్ని పెద్దగానే ఆలపించాడు మరీ చిన్నపిల్లాడిలా! రోజులిలాగే గడిచిపోతున్నాయి.

"తల్లిదండ్రుల్లో పరివర్తన తీసుకురావడానికే ఈ నాటకమంతా" అంటూ రోహిత్ గతాన్ని గూర్చి పూర్తిగా వివరించాడు షర్మిలకు.

"ఇప్పటికైనా ఈ నాటకానికి తెరదించేయండి ప్లీజ్" అంటూ భర్తతో సహా షర్మిల తిన్నగా వాళ్ల రూమ్ దగ్గరికి వెళ్ళింది. తలుపు గడియపెట్టి వుండడం చూసి..

"ఎక్కడికి వెళ్ళుంటారబ్బా! ఎందుకైనా మంచిది ఓసారి తలుపు తీసి చూద్దాం" అనుకుని తలుపుతీసి గదిలోకి వెళ్ళారిద్దరూ. రోహిత్ టేబుల్‌పైనున్న లెటర్ తీసి చదివాడు.

"చూడండి. ఇందులో మీ తప్పు ఎంతమాత్రం లేదు. కావాలనే చేసారో..నాటకమే ఆడారో! ఒకప్పుడు మేం చేసిన పనికి ఆ భగవంతుడు మాకీ శిక్ష వేసాడు. దాన్ని మేము ఆనందంగా అనుభవించినప్పుడే మా పాపానికి నిష్కృతి. ఒకవేళ మీరు మమ్మల్ని చేరదీయాలనుకున్నా అందుకు మా మనస్సాక్షి అంగీకరించదు. అందుకే మీకు దూరంగా వెళ్ళిపోతున్నాం. కొడుకు పుడితే మీకిష్టమొచ్చిన పేరు పెట్టుకోండి. కూతురు పుడితే మాత్రం నానమ్మ పేరు పెడతారని ఆశపడుతున్నాం. అనవసరంగా మాకోసం వెతికే ప్రయత్నం చేయొద్దని మనసారా కోరుకుంటున్నాం. ఈ ధర్మనిర్ణయానికి అడ్డు తగలొద్దని ప్రాధేయపడుతున్నాం. గాడ్ బ్లెస్ యూ" కథ ఇలా మలుపు తిరిగినందుకు నిశ్చేష్టులయిపోయారు.

ఎప్పటికైనా పెద్దవాళ్ళిద్దరూ కంటబడతారనీ..వాళ్ల నెలాగైనా ఒప్పించగల్గుతామనీ..అంతా కలిసి ఆనందంగా జీవిస్తామనీ..కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు షర్మిలా రోహిత్‌లిద్దరూ!

**-కొడుకుల సూర్యసుబ్రహ్మణ్యం**

(జగిత్యాల)

# ఆకర్షణ ఖరీదు


**గోదావరి ఎక్స్‌ప్రెస్ విశాఖపట్టణం నుండి కదిలింది. పెళ్ళిళ్ళ సీజన్ కావడం వలన కంపార్టుమెంటులన్నీ కిటకిటలాడుతున్నాయి. సుభద్ర అతికష్టంమీద కంపార్టుమెంటులో చొరబడింది. ఆమెది అసలే భారీకాయం కావడంతో, సీట్లలో కూర్చున్నవారు ఆమె వైపు ఎగాదిగా చూశారు కాని జరిగి కొంచెం స్థలం ఇవ్వడానికి కూడా ఇష్టపడలేదు.**

కానీ ఒక చేతిలో బేగ్, చంకలో ఓ ఆరేళ్ళ కుర్రాడు, మరో చేతిలో బుట్టతో బండి ఎక్కిన ఆమెను చూసిన ఓ ముసలావిడ 'పోన్లే' అని కొంచెం జరిగి చోటిచ్చింది. "అమ్మా! కిటికీ దగ్గర కూర్చుంటానే" అని మొరాయిస్తున్నాడు నానిగాడు, ఆమె ఆరేళ్ళ కొడుకు.

అసలే కష్టంగా సీటు దొరిందనుకుంటే, నానిగాడి కోరిక విని చిరాకుపడుతూ ఒళ్ళో కూచోమని బలవంతం పెడుతోంది సుభద్ర. కిటికీ దగ్గర కూచుని ఇదంతా గమనిస్తున్న ఓ ఇరవై ఐదేళ్ళ కుర్రాడు నానిగాడ్ని తన దగ్గరకు రమ్మని సైగ చేశాడు. నానిగాడు తల్లివేపు ఓసారి చూసి, పరుగెత్తుకెళ్ళి అతని దగ్గర కూర్చున్నాడు.

నానిగాడితో అతను ఏవేవో మాట్లాడుతున్నాడు. ఏవేవో అడుగుతున్నాడు. ట్రైను చప్పుడులో అవేమీ వినపడలేదు సుభద్రకి. కిటికీ బయటికి చూపిస్తూ ఏవేవో చెపుతున్నాడతను. కొద్ది సేపట్లోనే అతనికి బాగా చేరువైపోయాడు నాని. ఇంతలో అనకాపల్లి స్టేషన్ వచ్చింది. స్టేషన్‌లో సీజన్ టికెట్టు వాళ్లంతా హడావిడిగా దిగుతున్నారు. అయినా సరే ట్రైను ఏమాత్రం ఖాళీ అవలేదు.

ప్లాస్టిక్ కవర్లలో సీలు చేసిన వేరు సెనగ కాయల పేకెట్లు రెండు తీసుకున్నాడు. మామిడితాండ్ర పేకెట్ ఒకటి, నాలుగు కమలాలు కూడా తీసుకున్నాడు. "ఇవన్నీ మనిద్దరికే" అంటూ నానిగాడి చేతికి రెండు పాకెట్లు అందించాడు. "బాబూ! తప్పుకదూ, అలా తీసుకోవచ్చా" అన్న సుభద్రవైపు ఓసారి చూశాడు అతను. పలకరింపుగా నవ్వుతూ అతనివైపు చూసింది సుభద్ర. ఆమెక్కూడా ఏమైనా ఇద్దామనుకున్నాడు గానీ మళ్ళీ బాగుండదేమోనని ఇవ్వలేదు. నానిగాడ్ని ఒళ్లోకి లాక్కుని పాకెట్లు చింపుతున్నాడు. వేరు సెనక్కాయలు తింటూ బయటకు చూస్తున్నాడు నానిగాడు. అతను ఏవో జోకులు చెప్తున్నాడేమో, నానిగాడు అప్పుడప్పుడు హుషారుగా నవ్వుతున్నాడు.



మరి కాసేపట్లో బండి తుని స్టేషన్‌లో ఆగింది. ఈసారి రెండు ట్రీ టాప్ డ్రింక్స్ తీసుకున్నాడు. నానిగాడు స్ట్రాతో నెమ్మదిగా తాగుతున్నాడు. సుభద్ర వారించాలని ప్రయత్నించినా, ప్రయోజనం వుండదని ఊరుకుంది. "మనిద్దరమే తాగుతున్నాం, మరి మీ అమ్మగారికో" అనడంతో, తాగుతున్న బాటిల్ వాళ్ళమ్మవైపు చూపించాడు నానిగాడు. తప్పదన్నట్లు సుభద్ర కళ్ళెర్ర చేసింది. బండి కదిలింది. నెమ్మదిగా మిగిలినవి ఖాళీ చేస్తున్నారిద్దరూ.

కళ్ళు మూసుకొని ఆలోచనలో పడింది సుభద్ర. ఒక్క పైసా కూడా విదిలించని ఈరోజుల్లో ముక్కు, మొఖం తెలియకుండా కాస్తంత సేపు చేస్తున్న ఈ ప్రయాణంలో ఆ అబ్బాయి నానిగాడి పట్ల ఎంత ప్రేమతో అవన్నీ కొన్నాడు. అయినవాళ్ళు, దగ్గర వాళ్ళు కూడా ఆప్యాయత అనురాగం లేకుండా కక్షలు కార్పణ్యాలతో దూరం అయిపోతున్న రోజులివి. అలాంటిది ప్రేమతో నానిగాడ్ని దగ్గరకు తీసుకున్న ఆ అబ్బాయి విశాల హృదయాన్ని మనసులో పొగడకుండా ఉండలేకపోయింది సుభద్ర.

అన్నవరం దాటి పిఠాపురం చేరుకుంది బండి. చంకలో చిన్న సంచితో "వస్తాను బాబూ!" అంటూ సుభద్రవైపు ఓసారి చూసి బండి దిగిపోయాడు అతను.

తినగా మిగిలిన వేరు సెనక్కాయల పేకట్టుతో తల్లి దగ్గరకు చేరాడు నానిగాడు. దగ్గరకు తీసుకొని లాలనగా ముద్దాడింది కొడుకుని సుభద్ర. వాడి అందం, చురుకుదనం, వాడిపట్ల అందరికీ ఆకర్షణ పెంచుతుంది..అని మనసులో మురిసిపోయింది సుభద్ర కొడుకుని మరోసారి గాఢాలింగనం చేసుకుంటూ.

సామర్లకోట స్టేషన్‌లో బండి ఆగింది. హడావిడిగా బండి దిగి బాబుని తీసుకొని సామానుతో బయటపడింది సుభద్ర. "అమ్మా ఇందాక బండ్లో నా పక్కన కూర్చున్నతను, నా మెళ్ళో గొలుసు ఎంతని అడిగితే రూపాయన్నాను. అతను నాకీ రూపాయిచ్చి గొలుసు తీసుకున్నాడు" అంటూ తల్లి చేతికి జేబులోంచి రూపాయి తీసి ఇచ్చాడు నానిగాడు.

అంతే! సుభద్ర గుండె గతుక్కుమంది. గత నెలలో వాడి పుట్టినరోజు కోసం, తులం బంగారం పెట్టి చేయించిన గొలుసు అది. ఆమె కళ్ళలో ఒక్కసారిగా నీళ్ళు తిరిగాయి.

వాడు ఖర్చు చేసిన పాతిక రూపాయలతో ఎంత లాభం సంపాదించాడు. రిక్షా గోతిలో పడ్డంతో ఈ లోకంలోకి వచ్చింది సుభద్ర.

**-బద్దిగం పాండురంగారెడ్డి**

(కరీంనగర్)